కేసీఆర్ కల సాకారం

- మహేశ్వరం మెడికల్ కాలేజీకి గ్రీన్‌సిగ్నల్
- కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో జాప్యం
- రూ.176కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- గత ప్రభుత్వ హయాంలోనే మీర్‌ఖాన్‌పేటలో కాలేజీకి శంకుస్థాపన
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక చొరవ

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కళాశాలకు శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి (ఫైల్)

రంగారెడ్డి, సెప్టెంబరు 11(నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు మహేశ్వరం మెడికల్ కాలేజీ అందుబాటులోకి వస్తోంది. కళాశాల నిర్వహణకు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చింది. 50 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి సంబంధించి ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ త్వరలోనే మొదలుకానుంది. టీచింగ్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామకాలను సైతం పూర్తిస్థాయిలో చేపట్టనున్నారు. ఈ ఏడాది అక్టోబరు 14 నుంచి తరగతులను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం మెడికల్ కాలేజీని మంజూరు చేయగా..దీని వెనుక అప్పటి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కృషి ఉన్నది. కళాశాల నిర్మాణానికి అప్పట్లోనే ప్రభుత్వం రూ.176 కోట్లకు పరిపాలన అనుమతులను ఇచ్చింది. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో తేవడంతోపాటు సామాన్యులకు వైద్యం అందించాలన్న కేసీఆర్ సంకల్పం సాకారమవుతుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

బీఆర్ఎస్ హయాంలోనే కళాశాల మంజూరు ..

కేంద్రం సహకరించనప్పటికీ గత ప్రభుత్వంలో కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరంలో కాలేజీ ఏర్పాటు కోసం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేయగా ఆయన వెంటనే మంజూరు చేశారు. పరిపాలన అనుమతులను సైతం అప్పటి ప్రభుత్వం జారీ చేసింది. మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేటలోని సర్వే నంబర్ 112లో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదించగా..టీఎస్ఐఐసీ 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు మెడికల్ కాలేజీ భవన నిర్మాణానికి, 450 పడకల ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ రావడం..కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో కళాశాలకు సంబంధించిన ప్రక్రియ నిలిచిపోయింది.

అనుమతులకు జాప్యం

కాలేజీకి అనుమతులను ఇవ్వడంలో జాప్యం నెలకొంది. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 50 సీట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలంటే మొత్తం 59 మంది అధ్యాపక సిబ్బంది ఉండాలి. మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉండే ఆసుపత్రిలో బెడ్స్‌తోపాటు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంటుంది. ఈ ఏడాది జూన్‌లో తనిఖీలకు వచ్చిన ఎన్ఎంసీ అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొఫెసర్ల కొరతను అధిగమించేందుకు బదిలీలు చేపట్టడంతోపాటు అర్హత ఉన్న వారికి ప్రమోషన్లు ఇచ్చారు. ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను సవరించి ప్రభుత్వం ఫస్ట్ అప్పీల్‌కు వెళ్లింది. ప్రభుత్వం మొత్తం 8 కాలేజీలకు అనుమతుల కోసం ప్రయత్నించగా..కేవలం నాలుగింటికి మాత్రమే అనుమతులు లభించాయి. మహేశ్వరం కాలేజీకి మరోసారి భంగపాటు కలగడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అన్ని లోపాలను సరిదిద్ది సెకండ్ అప్పీల్‌కు వెళ్లింది. కాలేజీ ఏర్పాటుకు సంబంధించి ఇంకా ఏమైనా..సౌకర్యాలు, స్టాఫ్ అవసరమైతే తగిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. పరిశీలించిన ఎన్ఎంసీ మహేశ్వరం మెడికల్ కాలేజీ అనుమతులకు ఆమోదముద్ర వేసింది.

అక్టోబరులో తరగతులు ప్రారంభం..

అక్టోబరు 14 నుంచి తరగతులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మెడికల్ కాలేజీకి పక్కా భవనం లేకపోవడంతో ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లిలోని ఓ ప్రైవేటు కాలేజీ భవనంలో కాలేజీలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కేసీఆర్‌కు కృతజ్ఞతలు

కేంద్రం ఇవ్వనప్పటికీ జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటుకోసం కేసీఆర్ గొప్ప సాహసం చేసి మహేశ్వరానికి మెడికల్ కాలేజీని మంజూరు చేశారు. ముందుచూపుతో పల్లె, బస్తీ దవాఖానలను ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. మహేశ్వరం మెడికల్ కాలేజీ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో 450 పడకల ఆసుపత్రి అందుబాటులోకి రానుంది.మెడికల్ కాలేజీని మంజూరు చేసిన కేసీఆర్‌తోపాటు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన హరీశ్‌రావులకు కృతజ్ఞతలు.

– ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

వీ హబ్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఇన్‌క్లూజన్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ) : వీ హబ్ ఆధ్వర్యంలో మహిళ ఆంత్రప్రెన్యూర్లను తీర్చిదిద్దేలా ప్రాజెక్టు ఇన్‌క్లూజన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణలో మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రధానంగా ఐదు రంగాల్లో 6 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. రీ సస్టయినబులిటీ సీఎస్ఆర్ పార్టనర్‌గా వ్యవహరిస్తుండగా.. టైర్-2, 3 ప్రాంతాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా వీ హబ్ వర్గాలు వెల్లడించాయి. జూబ్లీహిల్స్‌లోని వీ హబ్ ప్రధాన కార్యక్రమంలో మధ్యాహ్నం 3-4 గంటల వరకు జరిగే ప్రాజెక్టు ఇన్‌క్లూజన్ కార్యక్రమం ప్రారంభించనున్నట్లుగా అసోసియేట్ డైరెక్టర్ ఊహ తెలిపారు.

57 మెట్రో స్టేషన్‌లను సందర్శించి గిన్నీస్ రికార్డు



సిటీబ్యూరో, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఇండియన్ రైల్ ఫ్యాన్ శశాంక్ మను రికార్డు సమయంలో 57 మెట్రో స్టేషన్‌లను సందర్శించి గిన్నీస్ రికార్డు సృష్టించారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులోని మూడు కారిడార్‌లలో ఉన్న 57 మెట్రో స్టేషన్‌లను 2 గంటల 41 నిమిషాల 31 సెకన్లలో పూర్తి చేశారు. శశాంక్ మను హైదరాబాద్ మెట్రో సందర్శనను గిన్నీస్ రికార్డుగా గుర్తించిందని ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ ట్విట్టర్ వేదికగా పోస్టు చేసింది.

ఏఐ, ఎంఎల్‌లో స్కిల్ డెవలప్‌మెంట్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ) : ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లర్నింగ్ అంశాల్లో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఎస్కీ డైరెక్టర్ రామేశ్వర్ రావు, ఏబీ విద్యాసంస్థల డైరెక్టర్ డా. సంజయ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లుగా తెలిపారు. 150కిపైగా నిరుద్యోగ యువత ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకున్నారని డా. సుమగ్న పట్నాయక్, సాయికిశోర్, ఎఫ్‌డీపీ సెల్, ఎస్కీ సిబ్బంది పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 11: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ నాన్‌టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు బుధవారం మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు.

షోల్డర్ సమస్యలకు ఆధునిక శస్త్ర చికిత్సలు

మాట్లాడుతున్న సన్‌షైన్ ఆసుపత్రి చీఫ్ ఆఫ్ షోల్డర్ సర్జన్ డాక్టర్ చంద్రశేఖర్

బేగంపేట్ సెప్టెంబర్ 11: ఆర్థోపెడిక్ రంగంలో వస్తున్న ఆధునిక వైద్య విధానాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లడంతో పాటు గాయాలు, ఫ్రాక్చర్‌లు, కండరాలు దెబ్బతినడం, ప్రొజన్ షోల్డర్ వంటి సమస్యలకు ఆధునిక శస్త్ర చికిత్స పద్ధతులు ఆర్థోస్కోపి, ఎండోస్కోపి విధానాలతో సరిచేయవచ్చని సన్‌షైన్ ఆసుపత్రి చీఫ్ ఆఫ్ షోల్డర్ సర్జన్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం బేగంపేట్‌లోని ఆసుపత్రిలో షోల్డర్ సమస్యలకు ఆధునిక శస్త్ర చికిత్సలపై లైవ్ సర్జరీతో పాటు వర్క్ షాపు నిర్వహించారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. భుజాలకు సంబంధించి ప్రొజన్ షోల్డర్ , కండరాల గాయాలు,ఫ్రాక్చర్స్ రోటెట్ కప్ మజిల్స్ దెబ్బతినడం వంటి సమస్యలకు ఆధునిక శస్త్ర చికిత్స విధానాలైన ఆర్థోస్కోపి, ఎండోస్కోపి విధానాలతో సరిచేయవచ్చునని తెలిపారు. ఈ సదస్సులో ఆస్ట్రేలియా బ్రిస్ బెయిన్‌కు చెందిన షోల్డర్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఆసిస్ గుప్తా పాల్గొని భుజం గాయాల శస్త్ర చికిత్సలపై మాట్లాడారు. ఈ సదస్సులో సర్జన్స్ డాక్టర్ కుషాల్‌తో పాటు తెలంగాణ, ఏపీ నుంచి 80 మంది నిపుణులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాల వద్ద పూజలు, అన్నదానాలు

భువనగిరి అర్బన్ : శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థలో ఏర్పాటు చేసిన గణనాథుడి పూజల్లో పాల్గొన్న సీఐ సురేశ్‌కుమార్

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 11 : పట్టణంలో ఏర్పాటు చేసిన గణేశ్ మంటపాల వద్ద పూజలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద పట్టణ సీఐ కె.సురేశ్‌కుమార్, ఎస్ఐ మల్లయ్య బుధవారం పూజలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్ మిట్టపల్లి శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో శివాజీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద మంగళవారం రాత్రి ఎలిమినేటి వెంకటయ్య స్మారకార్థం వారి కుమారుడు స్వామి మత్స్యగిరి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ కృష్ణయ్య ప్రారంభించారు. ఇందిరానగర్ కాలనీలోని బాబు జగ్జీవన్‌రావు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద కూరెళ్ల అనిత, అనిల్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు.

భువనగిరి అర్బన్ : పట్టణంలోని సాయి బాబా దేవాలయం సమీపంలో శ్రీసాయి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా వాకిటి లక్ష్మీనర్సింహ సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు ప్రారంభించారు. అనంతరం అన్నదాత నర్సింహను సన్మానించారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బీబీనగర్ : మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పలువురు నాయకులు పూజలు నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు అన్నదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గోలి పింగళ్‌రెడ్డి, నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, శ్యామ్‌గౌడ్ పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆత్మహత్యల నివారణ, మానసిక ఆరోగ్యంపై అవగాహన

మాట్లాడుతున్న మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

అడ్డగూడూరు, సెప్టెంబర్ 11 : మండలంలోని గురుకుల, కేజీబీవీ పాఠశాలల్లో బుధవారం ఆత్మహత్యల నివారణ, మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జీవితం విలువైందని, సకాలంలో జోక్యం ద్వారా ఆత్మహత్యలను నివారించవచ్చని అన్నారు. విద్యార్థులు భయం లేకుండా తమ భావాలను వ్యక్తీకరించడానికి పాఠశాలలు భద్రత కలిగిన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.

'హోమియోపతి వైద్యాధికారిని నియమించాలి'

కొలనుపాక హోమియోపతి దవాఖాన ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ సర్పంచ్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, గ్రామస్తులు

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 11 : హోమియోపతి వైద్యాధికారిని నియమించాలని మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొలనుపాక హోమియోపతి దవాఖాన ఎదుట బుధవారం గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా హోమియోపతి వైద్యాధికారి లలిత హైదరాబాద్‌కు వెళ్లిపోవడంతో నెల రోజులుగా దవాఖాన మూతపడిందని, దీంతో కొన్ని సంవత్సరాలుగా చికిత్స పొందుతున్న బాధితులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యం 200మంది దవాఖానకు వచ్చి మందులు తీసుకుపోయేవారన్నారు. రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వైద్యాధికారిని నియమించి దవాఖానను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

పాఠశాల గ్రంథాలయానికి విరాళం

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 11 : పల్లెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని గ్రంథాలయానికి 60 రకాల పుస్తకాల కొనుగోలు కోసం గ్రామానికి చెందిన గుర్రం కమలమ్మ, వెంకటయ్య జ్ఞాపకార్థం వారి మనువడు సంపత్ బుధవారం రూ.5వేల నగదు అందజేశారు. మున్ముందు పాఠశాల అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం దాతను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పల్లె శంకర్, ఉపాధ్యాయులు రవీందర్, విజయ్‌కుమార్‌రెడ్డి, త్యాగరాజచారి, శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

అభివాదం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

రవీంద్రభారతి, సెప్టెంబర్11: విద్యార్థుల మరణాలను, అస్వస్థతలను ప్రభుత్వం రాజకీయ కోణంలో చూడకుండా తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే ప్రభుత్వాలు ఎంత కాలం మనుగడ సాగించలేవని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల పోరాటంతోనే రాష్ట్రానికి సీఎం అయ్యాడని, ఆ విషయాన్ని మర్చిపోవద్దని గుర్తుచేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర బీసీ యువజన సంఘం రాష్ట్ర సదస్సులో ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు అద్దె భవనాల్లో కాకుండా సొంత భవనాలను నిర్మించాలని, రూ. 4,500 కోట్ల ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలని, విద్యార్థుల మెస్ చార్జీలను రూ. 1500 నుంచి రూ.3వేలు పెంచాలన్నారు. బీసీ కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచిన తరువాత గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే విడుదల చేయాలని,లేని పక్షంలో ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, జల్లపల్లి అంజి, గుజ్జకృష్ణ, నీల వెంకటేశ్, ఎర్ర సత్యనారాయణ, గొరిగె మల్లేశ్, గుజ్జ సత్యం,గవ్వల భరత్‌కుమార్, సతీశ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తెలంగాణ విలీనం అధికారికంగా నిర్వహించాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్11: తెలంగాణ విలీనం దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ట్యాంక్ బండ్ పై ఉన్న తెలంగాణ సాయుధ పోరాటయోధుడు మగ్దూం మొహియుద్దీన్ విగ్రహం నుంచి లిబర్టీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వరకు రెడ్ షర్ట్ వలంటీర్ల భారీ ర్యాలీ నిర్వహించారు. మొహియుద్దీన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగా పోరాట ఫలితమే దేశంలో హైదరాబాద్ సంస్థాన విలీనమని స్పష్ట ం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్, ఈ.టి నర్సింహ, కార్యవర్గ సబ్యులు రవీంద్ర చారి, హైదరాబాద్ కార్యదర్శి ఛాయదేవి, సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లిని ఆకుపచ్చ పారిశ్రామికవాడగా మారుస్తాం


మొక్కలు నాటుతున్న ఐలా చైర్మన్ రోషిరెడ్డి, కమిషనర్ ప్రభాకర్, కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి

చర్లపల్లి, సెప్టెంబర్ 11 : చర్లపల్లి పారిశ్రామికవాడను ఆకుపచ్చ పారిశ్రామికవాడగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పారిశ్రామిక వాడ ఐలా చైర్మన్ జక్కా రోషిరెడ్డి, ఐలా కమిషనర్ ప్రభాకర్ తెలిపారు. బుధవారం చర్లపల్లి పారిశ్రామిక వాడలో జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరున చెట్టు, ఒక ఉద్యోగి ఒక చెట్టు నాటి సంరక్షణ కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామికవాడలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గ్రీన్‌బెల్ట్‌లో మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఐలా చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పీఎస్ఎన్ ప్రసాద్, కోశాధికారి వెంకట్రామిరెడ్డి, పారిశ్రామికవేత్తలు దినేశ్‌రెడ్డి, కృష్ణారావు, సురేందర్‌రెడ్డి, కిశోర్‌కుమార్, రమణారావు, విక్రం, అంకితలతో పాటు ఐలా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గార్డ్స్‌ల సమస్యలు పరిష్కరించాలి

ధర్నా నిర్వహిస్తున్న ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సెలింగ్ ప్రతినిధులు

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 11: రైల్వే గార్డ్స్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం సికింద్రాబాద్, హైదరాబాద్ డీఆర్ఎం కార్యాలయం ఎదుట ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సెలింగ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జోనల్ సెక్రటరీ రత్నేశ్ కుమార్, జోనల్ ప్రెసిడెంట్ పార్థసారథి, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ ప్రవీణ్, హైదరాబాద్ డివిజన్ సెక్రటరీ కృష్ణలతో పాటు పలువురు రైల్వే గార్డ్స్ ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జోనల్ సెక్రటరీ రత్నేశ్ కుమార్ మాట్లాడుతూ రైళ్లలో విధులు నిర్వహించే రైల్వే గార్డులకు గతంలో ఐరన్ బాక్స్ ఉండేదని, ఇటీవల రైల్వే ఉన్నతాధికారులు ఈ ఐరన్ బాక్స్‌ను తీసి వేసి ట్రాలీ బ్యాగ్ ను అమలు లోకి తీసుకొని వచ్చారని తెలిపారు. ఈ ట్రాలీ బ్యాగ్ విధానంతో రైల్వే గార్డులకు ఎంతో ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్‌లలో ఈ విధానం అమలు అవుతుందని రానున్న రోజుల్లో రైల్వేలో పూర్తి స్థాయిలో అమలు చేసే ప్రయత్నం జరిగే ప్రమాదం ఉందని, ఈ విషయంలో రైల్వే గార్డులందరూ వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగా ఐరన్ బాక్స్ విధానాన్ని పునరుద్ధరించి, నూతనంగా అమలు చేసిన ట్రాలీ బ్యాగ్ విధానాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైల్వే జీఎం, డీఆర్ఎంకు ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సెలింగ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

డీలర్ కుటుంబానికి ఆర్థిక సాయం

భువనగిరి కలెక్టరేట్ : అనారోగ్యంతో మృతి చెందిన ముత్తిరెడ్డిగూడెం గ్రామ రేషన్ డీలర్ కుకుట్ల పద్మ కుటుంబానికి జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షుడు ఎలగల రాజన్న ఆధ్వర్యంలో బుధవారం రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల శంకర్, జిల్లా గౌరవాధ్యక్షుడు మన్నె యాదగిరి, కోశాధికారి ఎడ్ల దర్శన్‌రెడ్డి, భువనగిరి మండలాధ్యక్షుడు గంగాదేవి మహేశ్, నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

స్నేహితురాలికి అండగా..

రామన్నపేట : ఇబ్బందుల్లో ఉన్న మహిళకు స్నేహితులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. బోగారం గ్రామానికి చెందిన గుర్రం నరేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మరణానంతరం భార్య పారిజాతకు ఇద్దరు పిల్లలను పోషించడం ఇబ్బందిగా మారింది. తీరని కష్టాల్లో ఉందన్న సమాచారంతో ఆమె స్నేహితులు గాదె శోభారాణి, గోగు ఝాన్సీ రాణి, హేమలత, నవనీత బుధవారం రూ.10వేల ఆర్థికం సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

పేరేమో మహాత్ముడిది.. చెప్పేవన్ని అబద్ధాలే

మాధవరం రంగారావు

మియాపూర్ , సెప్టెంబరు 11 : దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహాత్ముడి పేరు పెట్టుకున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాడుతున్నారని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు , మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని ఇప్పుడేమో తాను పార్టీ మారలేదని అబద్ధపు ప్రకటనలిస్తున్నారని , ఇంతకు ఆయన ఏ పార్టీలో ఉన్నారో నియోజకవర్గ ప్రజలకు స్పష్టం చేయాలని రంగారావు డిమాండ్ చేశారు. బుధవారం రంగారావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం ఇల్లేం దేవాలయం కాదు...సీఎం పూజారేమి కాదని, ఆయన వేసుకున్న కండువా దేవాలయం కండువా కాదని, స్పష్టమైన కాంగ్రెస్ కండువాఅన్నారు. పదవుల కోసం పోలేదని చెబుతున్న గాంధీ పీఏసీ చైర్మన్ పదవిని ఎందుకు తీసుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ఎమ్మెల్యే గాంధీ అంటే నియోజకవర్గ ప్రజలు అసహ్యించుకుంటున్నారని , ప్రజల అండదండలతో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి పార్టీలు మారుస్తూ నమ్ముకున్న ప్రజలను నిట్ట నిలువునా మోసం చేస్తున్నారని రంగారావు విమర్శించారు. ఇకనైనా స్వలాభం కోసం రాజకీయ క్రీడను మానుకోవాలని ఆయన హితవు పలికారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేకు పీఏసీ సి